క్లుప్తంగా

నేడు బాబూ జగ్జీవన్ జయంతి

పార్వతీపురం: బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి పి. శశి భూషణ్ రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సభ జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్ కుమార్, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.

రూ.1.71 లక్షలకు పెదభోగిలి మార్కెట్ వేలం



మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ కె.కుమారవర్మ

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీ మార్కెట్ విక్రయాలకు సంబంధించి సర్పంచ్ జె.తేరేజమ్మ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటను రూ.1.71 లక్షలకు మర్రి చిన్నయ్య దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ కె. కుమార్‌వర్మ మాట్లాడుతూ పార్వతీపురం డివిజనల్ పంచాయతీ అధికారి ఉత్తర్వుల మేరకు పెదభోగిలి మేజర్ పంచాయతీ మార్కెట్‌లో అద్దెలు వసూలు చేయడానికి 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను బహిరంగ వేలం ద్వారా కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు రూ.82,500లుగా నిర్ణయించగా మర్రి చిన్నయ్య రూ1.71లక్షలకు పాడారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ జె.వెంకటరావు, జూనియర్ సహాయకుడు రమేష్ పాల్గొన్నారు.

పోలీసుల బందోబస్తు

సీతంపేట: బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దంటూ పలు గిరిజన సంఘాలు ఇటీవల ధర్నాకు పిలుపునిచ్చాయి. స్థానిక వైటీసీలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హాజరుకావడంతో.. వైటీసీ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ మురళీధర్ బందోబస్తును పర్యవేక్షించారు.

వాహనాల వేలం

కురుపాం: మద్యం కేసుల్లో పట్టుకున్న వాహనాలను స్థానిక ఎస్ఈబీ కార్యాలయం వద్ద మంగళవారం వేలం వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఈబీ ఎస్సై బి.వి.నాగభూషణరావు వాహనాలను వేలం నిర్వహించారు. ఐదు ద్విచక్ర వాహనాలు, ఒక బొలెరోను వేలం వేయగా.. పలువురు పాటదారులు వాటిని దక్కించుకున్నారు.

సర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు

భామిని: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని వడ్డంగి గ్రామంలో మంగళవారం తహసీల్దార్ నీలాపు అప్పారావు, డిప్యూటీ తహసీల్దార్ ఎల్.రమేష్‌కుమార్ సరిహద్దు రాళ్లు ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల సర్వేయర్ తోట రామ్మోహనరావు ఆధ్వర్యంలో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిన జిరాయితీ భూముల్లో రైతుల సమక్షంలో హద్దురాళ్లు పాతించారు. వడ్డంగి, బొమ్మిక, పక్కుడు భద్ర గ్రామాల్లో వరుసుగా స్టోన్ ప్లాంటేషన్ చేయిస్తామన్నారు. ఇప్పటికే మండలానికి 17500 హద్దు రాళ్లు వచ్చాయన్నారు. ఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్ఓలు, సహాయ సర్వేయర్లు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

విస్తృతంగా 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



కొమరాడ: చినఖేర్జిలలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అరుణ్‌కుమార్

కొమరాడ: మండలంలోని కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న చినఖేర్జిల గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సీహెచ్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు, గర్భిణులకు వైద్య సేవలందించారు. అనంతరం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

కొండాపురంలో..

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యురాలు వెన్నెల ఆధ్వర్యంలో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు సేవలందించారు. దీర్ఘకాలిక రోగులకు మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎన్ఎం కుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జగనన్నే మన భవిష్యత్ మెటీరియల్ పంపిణీ

బలిజిపేట:

ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమం ప్రచార సామగ్రిని మండలంలోని పదమాయవలస గ్రామంలో కన్వీనర్లు, గృహసారథులకు జెడ్పీటీసీ ఎ.రవికుమార్ సహా ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. ప్రచార సామగ్రిని మండల కమిటీ ఆధ్వర్యంలో పదమాయవలస, పెద్దింపేట, నారాయణపురం, చిలకలపల్లి గ్రామాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఎ.రవికుమార్ మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుంచి గ్రామాల్లో జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్దేశించిన ప్రకారం గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు నిర్వహించాలని కోరారు. ప్రతిరోజూ క్లస్టర్ పరిధిలో 15 గృహాలను సందర్శించి వారికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వారితో మమేకమై పార్టీకి ఓటు వేసే విధంగా వారికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జగన్, కె.వెంకటరమణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.



పదమాయవలసలో కన్వీనర్లకు పంపిణీ చేసిన సామగ్రి

గ్రామాలకు చేరుతున్న 'జగనన్నే మన భవిష్యత్' ప్రచార సామగ్రి

సీతానగరం: మండలంలో ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించే 'జగనన్నే మన భవిష్యత్' కార్యక్రమానికి అవసరమైన ప్రచార సామగ్రిని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో సచివాలయ కమిటీ సభ్యులు, గృహసారథులకు పంపిణీ చేశారు. ఈ మేరకు జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు మంగళవారం పెదభోగిలి, చినభోగిలి, ఆర్.వెంకంపేట, అంటిపేట, కాశీపేట, లచ్చయ్యపేట, రామవరం, తామర ఖండి గెడ్డలుప్పి, బక్కుపేట, రెడ్డివానివలస, కొత్తవలస, బగ్గందొరవలస, బళ్లకృష్ణాపురం తదితర గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో శుక్రవారం ప్రారంభంకానున్న 'జగనన్నే మనభవిష్యత్' కార్యక్రమం ఈ నెల 14 వరకూ జరుగుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు, స్థానిక సంస్థ ప్రజా ప్రతినిధులు, సచివాలయ కమిటీ ప్రతినిధులు, గృహ సారథులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అంబటి కృష్ణం నాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పి.ఈశ్వరనారాయణ, యు.సురేష్, ఆర్వీ పార్థసారథి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్‌లు, గృహ సారథులు, సచివాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అంటిపేటలో 'జగనన్నే మన భవిష్యత్ మెటీరియల్‌'ను అందచేస్తున్న మండల నాయకులు

జమ్మాన‌కు సన్మానం

పార్వతీపురం టౌన్: విశాఖపట్నం నుంచి రాయపూర్ మూడవ రైల్వే లైన్ ఏర్పాటులో భాగంగా పార్వతీపురం ప్రాంతంలో ఇల్లు కోల్పోయిన 16మంది బాధితులకు రెవెన్యూ అధికారుల సహకారంతో రూ.2 కోట్లు నష్టపరిహారం అందించిన ఏపీ టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్‌ను బాధితులు అభినందించి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తారన్నారు. బాధితులకు నష్టపరిహారం అందించిన రైల్వే, రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులకు ఈ సందర్భంగా జమ్మాన ప్రసన్నకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జమ్మాన ప్రసన్నకుమార్‌ను సత్కరిస్తున్న బాధితులు

పింఛన్ల పంపిణీతో గ్రామాల్లో పండగ వాతావరణం



కిడ్నీ వ్యాధిగ్రస్తునికి రూ.10వేలు అందజేస్తున్న సర్పంచ్ తిరుపతినాయుడు, గృహసారథులు, వలంటీర్



అప్పయ్యపేటలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న గృహసారథులు బి.సూర్యనారాయణ, గౌరునాయుడు

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం 5 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేయడంతో పింఛన్‌దారుల్లో పండగ వాతావరణం నెలకొంది. గ్రామాల్లోని వలంటీర్లు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్ పింఛన్ దారుల ఇళ్లకు వెళ్లి రూ.2 750లు వంతున పంపిణీ చేశారు. గెడ్డలుప్పిలో కిడ్నీ వ్యాధితో ఇబ్బంది పడుతున్న లబ్బ రాముకు రూ. 10 వేల పింఛన్‌ను సర్పంచ్ అల్లు తిరుపతినాయుడు, గృహ సారథులతో వలంటీర్ బాలకృష్ణ అందజేశాడు.

అజ్జాడలో విద్యుత్ సమస్య పరిష్కారం

బలిజిపేట: మండలంలోని అజ్జాడలో వారం రోజుల నుంచి గ్రామస్తులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను ఎమ్మెల్యే జోగారావు చొరవతో పరిష్కరించేదిశగా అధికారులు, సిబ్బంది పనులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో వారం రోజులుగా విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే జోగారావు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జోగారావు వెంటనే అధికారులను అక్కడికి పంపించి విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించడం, లైన్లు సక్రమంగా సరిచేయడం, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా సక్రమంగా పంపిణీ జరిగేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే జోగారావు ఆదేశానుసారం జెడ్పీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, జగన్, కె.వెంకటరమణ, అజ్జాడ ఉపసర్పంచ్ లక్ష్మణరావులు మంగళవారం పనులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్

లక్ష్మీనృసింహ స్వామి ఆలయ దశమ వార్షికోత్సవం



స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖినదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి ఆలయ దశమ వార్షికోత్సవాన్ని ఆలయ నిర్వాహకుడు సీహెచ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాసాచార్యులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలి రాజవంశీయులు నిర్మించిన వేణుగోపాల స్వామి ఆలయప్రాంగణంలో లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని నిర్మించి 10 సంవత్సరాలు పూర్తికావచ్చిన సందర్భంగా వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆలయంలో అర్చకుడు అష్టోత్తర కలశాభిషేకం చేసిన అనంతరం స్వామివారిని పల్లకీలో ఉంచి తప్పిటగుళ్లు, కోలాటంతో తిరువీధి చేశారు. వందలాది మంది భక్తులు కూడా తిరువీధిలో పాల్గొని పూజలు చేశారు.

వాడుక నీరు మళ్లించడానికి మేజిక్ సోక్‌పిట్ తీయించాలి



మాట్లాడుతున్న డీఈ హనుమంతరావు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిర్మాణం పూర్తయిన ఇళ్లలో వాడుక నీటిని మళ్లించడానికి ఇంజినీరింగ్ సహాయకులు ప్రత్యే శ్రద్ధ తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్లనిర్మాణం పూర్తి కావడం, కాలువ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇళ్లలో వాడుక నీరు మళ్లించడానికి మేజిక్ సోక్‌పిట్‌లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు అవగాహనకల్పించాలని కోరారు. అందుకు పంచాయతీ కార్యదర్శుల సహకారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఏఈ ఆర్.పవన్‌కుమార్, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పాలకొండ రూరల్: జగన్న కాలనీలో ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని నగర కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలోని యాలాం సచివాలయంలో హౌసింగ్ లబ్ధిదారులు, సిబ్బంది, వలంటీర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలు, బిల్లు చెల్లింపులు తదితర అంశాలను ఏఈ మాధవరావు వివరించారు. లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకొని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు సహకరించాలన్నారు.

హౌసింగ్ బిల్లులు సిద్ధం చేస్తున్నాం..

భామిని: మండలంలో నిర్మాణంలోని పీఎంఏవై గృహాల నిర్మాణ బిల్లులు పెట్టడానికి సిద్ధం చేస్తున్నామని హౌసింగ్ ఏఈఈ ఎల్.ప్రభాకరరావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, పార్టీ నాయకుడు ఎరుకుమజ్జి పాపినాయుడు మంగళవారం హౌసింగ్ ఏఈఈ ప్రభాకరరావును కలిసి బిల్లు చెల్లింపులపై చర్చించారు. బిల్లుల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని, త్వరగా చెల్లించేలా చూడాలని కోరారు. సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకొన్న వారి వివరాలు జియోట్యాగింగ్ చేయించి సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలన్నారు.

గిరిజనులకు హైజెనిక్ కిట్స్ పంపిణీ

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పార్వతీపురం మండలం వెలగవలస పంచాయతీ పిండిలోవ గ్రామంలోని గిరిజనులకు హైజెనిక్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే విద్యార్థుల చదువులపై ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధ చూపించాలని కోరారు. రక్తహీనతతో బాధపడుతున్న గిరిజన ప్రజలకు తగు సూచనలు సలహాలు ఇచ్చినట్లు చెప్పారు. గిరిజన యువకులు, పెద్దలకు దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణరావు, కోశాధికారి పెంటపాటి సూర్యారావు, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు చుక్క భాస్కరరావు, జి.గణేష్, బోటు రామకృష్ణ, సర్పంచ్ మెల్లిక వెంకయ్య, సెక్రటరీ గుజ్జల పకీరు, ఉపాధ్యాయులు, జీవితకాల సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు, జిల్లా కోఆర్డినేటర్ యమ్మల జనార్దనరావు పాల్గొన్నారు.



కిట్లు అందుకున్న గిరిజనులతో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

భాషా వలంటీర్లను రెన్యువల్ చేయాలి

సీతంపేట: భాషా వలంటీర్లను వెంటనే రెన్యువల్ చేయాలని ఆ సంఘం నాయకులు ఎస్.డొంబు ప్రభుత్వాన్ని కోరారు. సీతంపేటలో మంగళవారం భాషా వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అఖిల భారత కమిషన్‌కు ఇచ్చేందుకు 30 వేల సంతకాలు సేకరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, ఎస్.ఆనంద్, సుజాత, భారతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాషావలంటీర్ సంఘ నాయకుడు డొంబు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ కృష్ణారావు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారిలో వాహన తనిఖీలు నిర్వహించారు. రోడ్డుభద్రత నిబంధనలపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, నిబంధనలు అతిక్రమించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్సై శివప్రసాద్ ఉన్నారు.



వాహన తనిఖీలు చేస్తున్న డీఎస్పీ

ఫిష్ వెండింగ్ యూనిట్ల పంపిణీ

వీరఘట్టం: ఫిష్ ఆంధ్రా.. ఫిట్ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చేతులమీదుగా లబ్ధిదారులకు మొబైల్ ఫిష్ వెండింగ్ యూనిట్లు (త్రీవీలర్స్ వాహనాలు) పంపిణీ చేశారు. వండవలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మహిళా విభాగానికి సంబంధించి ఈ వాహనాలను పాలకొండకు చెందిన పి.కనకలక్ష్మికి అందించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారి డి.గోపీకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో 5 త్రీవీలర్స్, 3 ఫోర్ వీలర్స్ వాహనాలు రాయితీపై అందించనున్నామన్నారు. మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాండ్రంకి మురళీకృష్ణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నీలాపు శ్రీనివాసరావు, శోభనబాబు, ఆదినారాయణ తదితరులున్నారు.



మొబైల్ వాహన తాళాలు లబ్ధిదారుకు అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి, తదితరులు

అన్నదాతను అవస్థలకు గురిచేయొద్దు


పాలకొండ రూరల్: అన్నదాతలకు ఎటువంటి అవస్థలు లేకుండా క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వారికి సహకరించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. రైతులకు ఎటువంటి కష్టం వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బొమ్మాళి భాను అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవి నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా రూ.14 కోట్ల వ్యయంతో పలు పంచాయితీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. చేపట్టిన అభివృద్ధి పనులను తెలియజేసేలా ఫైలాన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాలతో పాటు సొంత స్థలంలో హౌసింగ్ స్కీం కింద ఇళ్ల నిర్మాణం చేస్తున్నవారికి సకాలంలో బిల్లులు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాలకొండ–రాజాం రహదారిలో స్థానిక వైఎస్సార్ కూడలి నుంచి సంకిలి చక్కెర కర్మాగారం వరకు రహదారి అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. రూ.3.75 కోట్లతో చేపట్టనున్న ఈ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని వడమ మీదుగా ఎస్ఈబీ కార్యాలయం వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్పొరేషన్ డైరెక్టర్లు వారి పరిధిలోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు లోలుగు విశ్వేరరావు, ఉపేంద్రకుమార్, ఎంపీడీఓ డొంక త్రినాథులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

సమన్వయంతో పనిచేయాలి

గరుగుబిల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని ఎంపీపీ ఉరిటి రామరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. పలువురు సభ్యులు ఆయా గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మధుర గ్రామాల్లో 104 ద్వారా వైద్య సేవలందించాలని ఎంపీపీ రామరావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కోరారు. వల్లరిగుడబ, రావుపల్లి తదితర గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకరరావు స్పందిస్తూ.. తాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులు చేపడతామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పట్టించుకోవడం లేదని పలువురు సభ్యులు ఆరోపించారు. సమావేశంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, ఐసీడీఎస్ పీఓ సుగుణకుమారి, వైస్ ఎంపీపీలు బి.లక్ష్మి, ఎస్.లక్ష్మి, తహసీల్దార్ అజురఫీ జాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉరిటి రామారావు

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి
- బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దంటూ తీర్మానం

సీతంపేట: గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. స్థానిక వైటీసీలో ఎంపీపీ బి.ఆదినారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, సీసీ రహదారులు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరినట్లు చెప్పారు. ఏప్రిల్ 10వ తేదీ తర్వాత నిధులు మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. అటవీశాఖ పరిధిలో 33 గ్రామాల్లో రెవెన్యూ, ఫారెస్టు శాఖలు సంయుక్తంగా సర్వే చేయాలని తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తికి సూచించారు. ఇటీవల ఏర్పాటైన కొత్త పంచాయతీల్లో సరిహద్దు సమస్యల పరిష్కారానికి వీఆర్వోలు బాధ్యత తీసుకోవాలని అన్నారు. పీసాచట్టం కింద గ్రామ సభలు నిర్వహించాలన్నారు. పలు సమస్యలపై తీర్మాణాలు చేసి పంపించాలన్నారు. భూములు రీసర్వే చేయాలని, మ్యూటేషన్ అవ్వడం లేదని సర్పంచ్‌లు ఆదిలక్ష్మి, సుందరమ్మ కోరారు. సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. దోనుబాయి, కుశిమి, మర్రిపాడు తదితర గ్రామాల్లో ఉన్న పీహెచ్‌సీలకు అంబులెన్స్‌లు కేటాయించాలని సర్పంచ్ వెంకునాయుడు అధికారులను కోరగా.. 10 అంబులెన్స్ కావాలని ప్రభుత్వానికి ప్రతిపాధన పెట్టామని తెలిపారు. నియోజకవర్గంలో 6,187 మందికి హౌసింగ్ మంజూరుకు ప్రతిపాధనలు పెట్టినట్లు హౌసింగ్ అధికారులు చెప్పారు. వైద్యశాఖ పనితీరుపై దోనుబాయి, కుశిమి వైద్యాధికారులు భానుప్రతాప్, రవీంద్ర వివరించారు. బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దంటూ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తీర్మాణం చేసి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహనరావు, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, విజయలక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎస్.లక్ష్మి, ఎంపీడీఓ కె.సత్యం, తహసీల్దార్ నరసింహమూర్తి, పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాసరావు, సీడీపీఓ రంగలక్ష్మి, పశువైద్యాధికారి ఆర్.శంకరరావు, హెచ్ఓ అమరేశ్వరి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చొద్దని తీర్మాన్ని ఎమ్మెల్యేకు అందిస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు